తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT





సంపుటి: 1 సంచిక: 53 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ ఆదివారం 22-09-2023 వెల: 5/రూ -

# తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు భేష్

## ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసలు

## సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కె, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్య, సాగునీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నామని, ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి వివరించారు.



మిగతా 2లో



## ఢిల్లీ సీఎం పీఠంపై ఆతిశీ

ఆమెతో ప్రమాణం చేయించిన ఎల్జీ వీకే సక్సేనా..

ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిపిన్న వయస్కురాలు ఆమే

ఢిల్లీకి 3వ మహిళా సీఎం.. దేశంలో 17వ మహిళా సీఎం

ప్రమాణం తర్వాత కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై ఆతిశీ ఆసీనులయ్యారు. శనివారం, ఇక్కడ రాజ్‌నివాసలో జరిగిన కార్యక్రమంలో ఎల్జీ వినయ్‌కుమార్ సక్సేనా అతిశీతో ప్రమాణం చేయించారు. ఆమెతో పాటు క్యాబినెట్ మంత్రులుగా

2లో

# లడ్డూ అపవిత్రంపై చంద్రబాబు హెచ్చరిక

తదుపరి చర్యలపై అందరితోనూ చర్చిస్తున్నాం

తిరుమల ప్రక్షాళనతోనే పాపం బయటపడింది

బాబాయిని చంపి చెప్పిన అబద్ధాలే చెబుతున్నారు

తిరుమల లడ్డూకు వందల ఏళ్ల ప్రాశస్త్యం

గత ఐదేళ్లలో దాన్నంతా నాశనం చేశారు

లడ్డూలో వాడే నెయ్యికీ రివర్స్ టెండర్లు ఏమిటి?

తిరుమల కొండపై అసలు ల్యాబే లేదు..

జగన్ వెళ్లి కూర్చుని పరీక్షలు చేశారా?: సీఎం



మిగతా 2లో



## సంచలనంగా మార్చొద్దు

తిరుమల లడ్డూ విషయంలో రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి

హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఏపీ సర్కారుకు సూచన

2లో

## కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

హైదరాబాద్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు.కేటీఆర్ చెప్పినట్లు అమృత్ స్కీమ్ కింద టెండర్లు

# సీఎం బంధువుకు రూ.1000 కోట్ల పనులు



అమృత్ టెండర్లలో భారీ అవినీతి.. అర్హత లేకున్నా 8,888 కోట్ల పనులు

బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయం.. టెండర్లపై విచారణ జరిపించాలి

ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం కింద సీఎం రేవంత్‌రెడ్డి పదవి కోల్పోవడం పక్కా

కుంభకోణాలను ఒక్కొక్కటిగా బయటపెడతాం: మాజీ మంత్రి కేటీఆర్

2లో



## దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు.. జలమయం

మోకాల్లోతు నీరు..

భారీగా ట్రాఫిక్ జామ్

చేతులెత్తేసిన పోలీసులు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రెండ్రోజులుగా గ్రేటర్‌లో వాన దంచికొడుతున్నది. ఈ క్రమంలో శనివారం రాత్రి గంటన్నరపాటు ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి మహానగరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులపై మోకాల్లోతు వాననీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, మలక్‌పేట, ఎల్బీనగర్, మెహిదీపట్నం, రేతిబౌలి, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

2లో

# తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు భేష్

(మొదటి పేజీ తరువాయి)

తాము ప్రాధాన్యంగా తీసుకుంటున్న ప్రాజెక్టులకు ఆర్థిక సహకారంతో పాటు అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ప్రాజెక్టులు నిలిచేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. విద్యా, వైద్య రంగాల్లో రేవంత్‌రెడ్డి దార్శనికత బాగుందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టీన్ రైజర్ ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏ రంగాలను ప్రాధాన్య అంశాలుగా ఎంచుకుందో అవే తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయని మార్టిన్ రైజర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో సిబ్బంది కొరతను అధిగమించాలని సీఎం ఎ.రేవంత్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాల యంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ప్రస్తుత ఇండస్ట్రీ అవసరాలకనుగుణంగా సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, మార్కెట్ అవసరాలకనుగుణంగా ఏటీసీల్లో సిలబస్ ఉండాలని, ఈ మేరకు సిలబస్ మార్పునకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించి నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. వృత్తి నైపుణ్యం అందించే ఏటీసీలను, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సీ.ఎస్ శాంతికుమారి, కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంచలనంగా మార్చొద్దు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న అంశాన్ని సంచలనాత్మకంగా మార్చొద్దని రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలు గతంలోనూ జరిగిన నేపథ్యంలో వాటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలతో భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదం ఉందని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీలు, ధార్మిక సంస్థలు బాధ్యతతో వ్యవహరించి సంయమనం పాటించాలని ఓ ప్రకటనలో సూచించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే లక్షలాది మంది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు.. వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని కిషన్ రెడ్డి కోరారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని పేర్కొన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం క్షమార్హం కాదన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నేరస్తులకు తగిన శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళు_న్నాయని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి తగిన శిక్ష పడేలా చేయాలని కోరారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కిషన్‌రెడ్డి సూచించారు.


# కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్



అయినట్లు నిరూపిస్తే తాను మంత్రిగా రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన ఆరోపణలను నిరూపించాలన్నారు. ఈ విషయమై శనివారం(సెప్టెంబర్21) పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ఆరోపణలను నిరూపించకపోతే కేటీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా చెప్పాలన్నారు.రూ. 3వేల6వందల కోట్లు కాస్తా రూ. 8888 కోట్లు ఎలా అయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్లను గత ?ప్రభుత్వమే వాళ్లు దిగిపోయే సమయంలో 3 ప్యాకేజీల కింద ఇచ్చారని చెప్పారు.

# సీఎం బంధువుకు రూ.1000 కోట్ల పనులు

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి అర్హతలేకపోయినా వేయి కోట్ల పనులను అప్పగించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో రూ. 8,888 కోట్ల అవినీతి జరిగిందని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరిపించి టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు టెండర్లు దక్కేలా చేసిన రేవంత్‌రెడ్డి.. ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం ప్రకారం పదవి కోల్పోతారని పేర్కొన్నారు.శనివారం తెలంగాణ భవన్‌లో శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్లపై కేంద్రం విచారణ చేయకుంటే బీజేపీ–కాంగ్రెస్ కుమ్మక్కు అయినట్టే అనుకోవాల్సి ఉంటుందన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు సైతం రేవంత్‌రెడ్డిని పొగడటం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని అన్నారు.రేవంత్ తన కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కలిగేలా వ్యవహరిస్తూ అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, త్వరలోనే వరుసగా వాటిని బయటపెడతానని చెప్పారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కుటుంబ కథా చిత్రం నడుస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే భారీ కుంభకోణానికి రేవంత్ పాల్పడ్డారని ధ్వజమెత్తారు.తెలంగాణలోని వివిధ పట్టణాల్లోని మంచినీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద టెండర్లు పిలిచారని, సీఎంగా, మున్సిపల్ వ్యవహారాలశాఖ కూడా చూస్తున్న రేవంత్‌రెడ్డి ఈ కుంభకోణం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అమృత్ టెండర్లు ఇస్తే.. ప్రజలకు మాత్రం విషం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ టెండర్లలో సీఎం కుటుంబ సభ్యులు భారీ అవినీతికి పాల్పడినట్టు తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు. దీనిపై కేందమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు.సీఎం బావమరిది సూదిని సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అర్హతలు లేకున్నా వేలకోట్ల రూపాయల పనులు కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వనరులు కానీ, ఆర్థిక పరపతి కానీ, సంపత్తి కానీ దానికి లేవని తెలిపారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకొని, ఇండియన్ హ్యూమ్ పైప్ (ఐహెచ్‌పీ) అనే కంపెనీని పిలిపించి, బెదిరించి ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని ఆరోపించారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్‌రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని పేర్కొన్నారు.అందులో భాగంగానే జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకి తెరలేపారని ఆరోపించారు. రూ. 1137 కోట్ల కాంట్రాక్టు దక్కిందని చెప్తూ ఎన్ఎస్ఈ, బీఎస్ఈకి ఐహెచ్‌పీ లేఖ రాసిందని వివరించారు. 20 శాతం పనిని తాము చేస్తున్నామని, ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ మాత్రం 80 శాతం అంటే దాదాపు వెయ్యి కోట్ల పనిచేస్తుందని లేఖలో పేర్కొన్నారని తెలిపారు. కంపెనీని శిఖండి సంస్థగా అడ్డంపెట్టుకుని రేవంత్‌రెడ్డి, సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని విమర్శించారు. రూ. 2 కోట్ల సృజన్‌రెడ్డి కంపెనీ రూ. 1000 కోట్ల పనులు, పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ అయిన ఐహెచ్‌పీ రూ. 200 కోట్ల పనులు చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 1988 లో సెక్షన్ 7, 11, 13 నిబంధనల ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆయన సీఎం పదవి కోల్పోతారని కేటీఆర్ తెలిపారు. తన కుటుంబ సభ్యులకు లబ్ధిచేకూరిస్తే, ఆశ్రిత పక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు. గతంలో ఇవే చట్టాల కింద సోనియాగాంధీ 2006లో నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారని గుర్తుచేశారు.అక్రమ మైనింగ్ అనుమతుల నేపథ్యంలో కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప, ఆదర్శ్ కుంభకోణంలో 2011లో మహారాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి అశోక్ చవాన్ పదవి కోల్పోయారని గుర్తు చేశారు. బావమరిది కండ్లలో సంతోషం కోసం రేవంత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. తన ఇంట్లో లంకెబిందెలు నింపుకోవడం కోసమే అక్రమ టెండర్లకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ టెండర్ల వివరాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.ఎరిన్ని కుంభకోణాలు రేవంత్‌రెడ్డి కుంభకోణాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందు ఉంచుతానని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్త్ సిటీ కుంభకోణాలను బయటపెడతానని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తొలుత దీనిపై మాట్లాడారని, ఆ తర్వాత కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో దీనిపై మాట్లాడడం మానేశారని విమర్శించారు.

# లడ్డూ అపవిత్రంపై చంద్రబాబు హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: "దేశంలోనే అతి పవిత్ర క్షేత్రాల్లో తిరుమల ఒకటి. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా అక్కడ తప్పు చేసినవారు చరిత్ర హీనులుగా మిగిలిపోయేలా శిక్షిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. శనివారం ఉదయం ఆయన ఇక్కడ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా కొద్దిసేపు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. లడ్డూ తయారీని అపవిత్రం చేశారన్న విషయం బయటకు వచ్చిన తర్వాత దీనిపై ఏం చేయాలన్నదానిపై అందరితో మాట్లాడుతున్నామని ఆయన చెప్పారు. "ప్రజల మనోభావాలు గౌరవించాలి. అదే సమయంలో శ్రీవారి ఆలయ గౌరవం పెంచాలి. మళ్లీ ఇటువంటి పాపాలు ఎవరూ చేయకుండా చూడాలి. ఇందుకు ఏం చేయాలనేది లోతుగా ఆలోచిస్తున్నాం" అని ఆయన వివరించారు. తిరుమల లడ్డూకు వందల ఏళ్ల ప్రాశస్త్యం ఉందని, దానిని గత పాలకులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రసాదం లడ్డూను కాపీ కొట్టి తయారు చేయాలని అనేకమంది ప్రయత్నం చేశారు. కానీ ఎవరికీ అది సాధ్యపడలేదు. ఆ లడ్డూ తయారీ ఫార్ములా... అందులో వాడే పదార్థాలను కలపడంపై ఆ ఆలయంలో అత్యంత నైపుణ్యం సంపాదించారు. నేను అయోధ్యకు వెళ్లినప్పుడు అక్కడ బిహార్‌కు చెందిన ఒక ధర్మకర్త కలిశారు. అయోధ్యలో తిరుమల తరహా లడ్డూ ప్రసాదాన్ని పెట్టాలని తిరుపతి నుంచి అనుభవం ఉన్నవారిని తీసుకువెళ్లి ప్రయత్నం చేశానని, కానీ ఆ రుచి రాలేదని ఆయన చెప్పారు. గతంలో ఇంట్లో తిరుమల ప్రసాదం ఉంచితే ఇల్లంతా ఘుమఘుమలాడేది. అంత ప్రాశస్త్యం వీళ్ల వల్ల నాశనం అయింది. ఏమిటీ దుర్మార్గం అని మనసు చివుక్కుమంటోంది. ఆవేశం, బాధ కలుగుతున్నాయి. మన ప్రజలు....బాబాయిని కిరాతకంగా చంపినా భరించారు. ఆ రోజే తిరుగుబాటు జరిగి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు. నెయ్యికి రివర్స్ టెండరింగ్ ఏమిటి? కిలో నెయ్యి రూ. 320కి ఎలా వస్తుంది? కనీస ఆలోచన అక్కర్లేదా? ఇవి చేయాలని దేముడు చెప్పాడా' అని ప్రశ్నించారు.

**దేముడే నా నోట చెప్పించాడేమో!**

పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికే లడ్డూ వివాదాన్ని చంద్రబాబు లేవనెత్తారని జగన్ చేసిన ఆరోపణను ఆయన తిరస్కరించారు. "ఇందులో దృష్టి మళ్లించడం ఏముంది? మా ప్రభుత్వం రాగానే తిరుమలకు ఈవోగా శ్యామలరావును వేశాం. తిరుమలను ప్రక్షాళన చేయాలని చెప్పాం. ఆయన నాకు ప్రతి రోజూ ఏం చేస్తున్నారో చెప్పరు. మేం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అన్నీ సరిచేసుకొంటూ వెళ్లారు. నాణ్యతను పరీక్షించి కొన్ని కంపెనీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. నిపుణుల కమిటీ వేసి వారి సలహాలు తీసుకొన్నారు. మంచి నెయ్యి కోసం మళ్లీ టెండర్లు పిలిచి నందినీ నెయ్యిని ఎంపిక చేశారు. ప్రక్షాళన చేశారు. కానీ అవన్నీ బయటకు చెప్పలేదు. ఆ రోజు ఎన్డీయే సమావేశంలో అనుకోకుండా ఈ విషయాలు నా నోటి నుంచి వచ్చాయి. దేముడే చెప్పించాడేమో' అని చంద్రబాబు అన్నారు. జగన్ హయాంలో జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని వ్యాఖ్యానించారు. "రామతీర్థంలో రాముడి తల తీస్తే పట్టించుకొన్న దిక్కు లేదు. తిరుమలను అపవిత్రం చేస్తున్నారని ఎంతోకాలంగా భక్తులు అంటున్నా పట్టించుకోలేదు. ఇప్పుడవన్నీ బయటకు వచ్చినా పశ్చాత్తాపం లేదు. ఎదురు దాడితో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే మాఫియా డాన్ ఎస్కోబార్‌తో పోల్చాను" అని అన్నారు.

నెయ్యి నాణ్యతను ప్రతి రోజూ మూడుసార్లు పరీక్ష చేస్తున్నారన్న జగన్ వాదనను చంద్రబాబు ఎద్దేవా చేశారు. "తిరుమలలో అసలు ల్యాబ్ లేదు. మరి పరీక్షలు ఎలా చేస్తారు? జగన్ వెళ్లి చేశాడా? వైవీ సుబ్బారెడ్డి వందసార్లు మాల వేసుకొన్నారట! బ్రహ్మోత్సవాల సంప్రదాయాలు ఆయన ఏనాడైనా పాటించారా? జగన్ ఇంటి దగ్గర తిరుమల సెట్టింగ్ వేయించడం ఏం పద్ధతి? ప్రతి ఆలయానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. కేరళలో గురువాయూర్ ఆలయం లోపలికి వెళ్లాలంటే చొక్కా తీసి వెళ్లాలి. అది అక్కడ పద్ధతి. తిరుమలలో స్వామివారిని అన్య మతస్థులు దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇచ్చి వెళ్లాలి. దానిని పాటించారా? ఆలయ సంప్రదాయాలను గౌరవించే బాధ్యత వీరికి లేదా? మనోభావాలను పట్టించుకోరా? గతంలో అనేక మంది పాలకులు వచ్చినా ఎవరూ స్వామివారి విషయంలో లాలూచీ పడలేదు. వీళ్లు వచ్చి విచ్చలవిడిగా చేశారు. పవిత్ర క్షేత్రం విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యవహరించాలన్న జ్ఞానం లేకుండా వ్యవహరించారు" అని ఆయన అన్నారు. తిరుమలలో సంప్రోక్షణ ఎలా చేయాలన్నదానిపై జీయర్లు, కంచి పీఠాధిపతులు, సనాతన ధర్మ నిపుణులు అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకొంటామని ఆయన తెలిపారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందుతున్న తీరుపై శనివారం మరోసారి సమీక్ష చేస్తున్నామని, త్వరగా అందడానికి చర్యలు తీసుకొంటామని చంద్రబాబు తెలిపారు."తిరుమల లడ్డూను కాపీ కొట్టి తయారు చేయాలని అనేకమంది ప్రయత్నం చేశారు. కానీ ఎవరికీ అది సాధ్యపడలేదు. ఆ లడ్డూ తయారీ ఫార్ములా... అందులో వాడే పదార్థాలను కలపడంపై ఆ ఆలయంలో అత్యంత నైపుణ్యం సంపాదించారు. నేను అయోధ్యకు వెళ్లినప్పుడు అక్కడ బిహార్‌కు చెందిన ఒక ధర్మకర్త కలిశారు.



# దంచికొట్టిన వాన

వాహనాలను క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వాహనదారులు మరింత ఇబ్బందులుపడ్డారు. కాగా, శనివారం రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 9.10 సెం.మీల వర్షపాతం నమోదైంది. రాగల 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశమున్నదని, దీని ప్రభావంతో రాగల మూడు రోజులు మోస్తరు నుంచి భారీ, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది.

# ఢిల్లీ సీఎం పీఠంపై ఆతిశీ

సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాత్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణం చేశారు. మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఆప్ నేతల కుటుంబసభ్యులు ఆతిశీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం చేశారు. ఆతిశీ సీఎంగా ప్రమాణం చేయడంతో ఢిల్లీలో వరుసగా నాలుగోసారి ఆప్ ప్రభుత్వం ఏర్పడినట్లయింది. మంత్రులకు శాఖలను కూడా ఆతిశీ కేటాయించారు.ఆమె తన వద్ద 13 శాఖలను అట్టిపెట్టుకున్నారు. రెవెన్యూ, ఆర్థికం, విద్య తదితర ముఖ్యమైన శాఖలు ఆమె పరిధిలోనే ఉన్నాయి. సౌరభ్ భరద్వాజ్‌కు 8 శాఖలు, గోపాల్ రాయ్‌కు 3 శాఖలు, కైలాశ్ గెహ్లాత్‌కు 5శాఖలు, ఇమ్రాన్ హుస్సేన్‌కు 2 శాఖలు, ముఖేశ్ అహ్లావత్‌కు 5 శాఖలను ఆమె కేటాయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆమె కొద్దికాలమే సీఎం పదవిలో ఉంటారు. ఢిల్లీ సీఎం పదవి చేపట్టిన ఎనిమిదో వ్యక్తి ఆతిశీ. ఆమె వయసు 42 ఏళ్లు. ఢిల్లీ సీఎం పీఠాన్ని అధిష్టించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. దేశంలో 17వ మహిళా ముఖ్యమంత్రిగా, ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా రికార్డుల్లోకి ఎక్కారు.

కేజ్రీవాల్ ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చారు

గత పదేళ్లలో ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ది అని ముఖ్యమంత్రి ఆతిశీ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి బాధను కేజ్రీవాల్ అర్థం చేసుకున్నారని, ప్రజలకు ఉచిత వైద్యం అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల జీవితాలను మెరుగుపర్చడానికి కేజ్రీవాల్ కృషి చేశారని పేర్కొన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సీఎంగా అవకాశమిచ్చినందుకు కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను సఫలం కానివ్వబోమని తెలిపారు.



# ఎఫ్ టి ఎల్ పరిధిలో అడ్డగోలుగా నిర్మాణాలు



**కబ్జాదారులకు వంతపాడుతున్న కొందరు అధికారులు**

**సెల్లార్ లో ఒక్కసారిగా నీరు ఉబికి పైకి రావడంతో వెలుగులోకి**

**ప్రమాదకరంగా మారిన.. ఫామ్ హౌస్ , స్విమ్మింగ్ పూల్**




హైడ్రా దెబ్బకు అడ్డగోలు ఆక్రమణలు, హద్దుమీరిన నిర్మాణాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రక్రుతికి కూడా హైడ్రాకు అండగా ఉంటుంది అన్నట్లుగా వర్షాల ప్రభావంతో చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలు బయటపడుతున్నాయి.తాజాగా కుతుబ్ షాయిపేట్ గ్రామ శివారులో 93 సర్వేనంబర్ లో ఉన్న ఈ చెరువు మూడు ఎకరాలమ ఎఫ్ టీఎల్ భూమిని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు.

**సంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్21:** హైడ్రా దెబ్బకు అడ్డగోలు ఆక్రమణలు, హద్దుమీరిన నిర్మాణాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రక్రుతికి కూడా హైడ్రాకు అండగా ఉంటుంది అన్నట్లుగా వర్షాల ప్రభావంతో చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలు బయటపడుతున్నాయి.తాజాగా కుతుబ్ షాయిపేట్ గ్రామ శివారులో 93 సర్వేనంబర్ లో ఉన్న ఈ చెరువు మూడు ఎకరాలమ ఎఫ్ టీఎల్ భూమిని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. పూర్తిగా ఎఫ్ టీఎల్ లోనే భవనాలు నిర్మించడమే కాకుండా అందులో స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌజ్ నిర్మించారు. కొందరు రెవెన్యూ అధికారుల అండతో నిర్మాణాలు చేశారు. విషయం తెలిసినా కూడా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. చెరువుకు చెందిన ఎఫ్ టిటఎల్ పరిధిని సైతం ఆక్రమించిన కబ్జాబాబులు ఏకంగా బహులంతస్తుల ఫాం హౌస్ నిర్మించడంతోపాటు ఏళ్లతరబడి ఈ స్దలంలో రేవ్ పార్టీలు, న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నరాన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..మల్కాపూర్ పెద్ద చెరువు విస్తీర్ణంలోని సర్వే నంబర్ 93లో ఎఫ్‌టీఎల్ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు పలువురు కుతుబ్ షాయిపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్ద చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, అందువల్లే చెరువు కబ్జాకు గురైనట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎఫ్ టీఎల్ లో నిర్మించిన బహుళ అంతస్తుల భవనం చుట్టూ పెద్ద ఎత్తున నీరు చేరింది.




**పంచాయతీ సెక్రెటరీ మన్మోహన్ సింగ్ వివరణ**

కుతుబ్షా పేట పెద్ద చెరువు ఆక్రమించి నిర్మిస్తున్నట్టుగా మా దృష్టికి వచ్చింది. గత పంచాయితీ అధికారులు హయాంలో ఈ నిర్మాణం చేపట్టారు. గ్రామస్తులు ఇదే విషయాన్ని గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురాగా ఇట్టి నిర్మాణానికి నోటీసులు జారీ చేయడం జరిగింది. శనివారం నాడు ఎంపీ ఓ శ్రీనివాస్ తో కలిసి చెరువులో నిర్మించిన కట్టడాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఇట్టి కట్టడం చేపట్టిన వారు పటాన్చెరు నివాసితుడిగా గుర్తించారు వారికి అక్రమ కట్టడాల నోటీసులు కూడా జారీ చేయడం జరిగింది. ఇట్టి విషయం కోర్టులో స్టేటస్కో స్టే తెచ్చుకున్నామని మాకు తెలియజేశారు. చెరువులు ప్రభుత్వ భూములు, కుంటలు ఎవరైనా కబ్జా చేస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదన్నారు త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

## ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి..

**సంగారెడ్డి జిల్లా, ప్రతినిధి డైలీ రిపోర్ట్:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపు వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఫోరమ్ నాయకులు. స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి తెలంగాణ ఉద్యమకారుడు సహకార సంఘాల ఉద్యమ కారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపు వర్ధంతి సందర్బంగా సంగారెడ్డి లో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ఉపాధ్యక్షులు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, సహా కార్యదర్శి పాండురంగం శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి వరాల తదితరులు పాల్గొన్నారు.



## కంది జైల్ ను అకస్మిక తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి రమేష్

**కంది. సెప్టెంబర్ 21( డైలీ రిపోర్ట్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర ఆదేశాల ప్రకారం శనివారం నాడు కంది సెంట్రల్ జైలు సంగారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వి రమేష్ తనిఖీ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రమేష్ సెంట్రల్ జైల్ నందు బార్డర్ గది, వంటగది మరియు బాత్రూం, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించి ఖైదీలను జైల్లో ఉన్న సదుపాయాలను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి కావలసిన అవసరాలను సదుపాయాలను అన్ని అందేలా చూడాలన్నారు ఖైదీలతో వారి సమయాన్ని బెయిల్, ములకత్ అందుతున్నాయా అని తెలుసుకున్నారు .కేసులు త్వరితంగా పరిష్కరించేలా న్యాయవాదులు లేని వారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకి అర్జీ పెట్టుకున్నట్లయితే ఉచిత న్యాయ సేవలు పొందుటకు న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు .ఈ తనిఖీ నందు జిల్లా న్యాయ



సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి రమేష్, సూపర్‌ఇండెంట్ తదితరులు పాల్గొన్నారు.



# బాబు నాయక్ కొత్త బాత్రూమ్‌లు మరియు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

**శంకరపల్లి :సెప్టెంబర్ 21:(డైలీ రిపోర్ట్ ):** మోకీలా తండా గ్రామానికి చెందిన బాబు నాయక్ శనివారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో నూతన బాత్రూమ్‌లు మరియు ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు శుభ్రత మరియు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడమే కాకుండా, నీటి నాణ్యతను కూడా మెరుగుపరుస్తున్నారు. బాబు నాయక్ మాట్లాడుతూ, "పాఠశాలలో అవసరాలను గుర్తించి, వాటిని తీర్చడానికి ముందడుగు వేస్తున్నాం. విద్యార్థుల సౌకర్యం, ఆరోగ్యం మా ప్రాథమిక ఆవశ్యకత" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు మరియు విద్యార్థులు హాజరయ్యారు. ఇది గ్రామంలో విద్యాభివృద్ధికి మరియు ఆరోగ్యానికి ఒక సుస్థిర అడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ చర్యల వల్ల, విద్యార్థులు ఆరోగ్యకరమైన పర్యావరణంలో చదువుకు ప్రోత్సహితమవుతున్నారు. గ్రామంలో ఈ రకమైన కార్యక్రమాలు కొనసాగించాలని కోరుకుంటున్నారు.

# అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించాలి

## తపస్ సంగారెడ్డి జిల్లా శాఖ

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్21(డైలీ రిపోర్ట్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయుటకు గాను కలెక్టర్లకు విద్యాశాఖ అనుమతినిచ్చిన నేపథ్యంలో అట్టి ఉత్తర్వులను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు దత్తాత్రి,అడివప్ప తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుందని, నిర్ణీత సమయంలో నిర్దేశించిన విద్యా ప్రమాణాలను మరియు సామర్థ్యాలను విద్యార్థుల్లోపల కల్పించడం అత్యంత కఠినంగా మారిందని వారు తెలిపారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేదా ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నప్పుడు మాత్రమే సరియైన విధంగా బోధనాభ్యసన జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం యొక్క ఇలాంటి చర్యల వల్ల ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పని భారం పడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఇలాంటి చర్యలు తీవ్ర విఘాతం కలిగిస్తాయని అందుకే వీటిని వ్యతిరేకిస్తున్నామని మీడియాకు తెలియజేశారు. గడిచిన 10 సంవత్సరాలలో విద్యా వ్యవస్థ తీవ్రంగా సమస్యలను ఎదుర్కొంటుందని నూతన ప్రభుత్వంలో ఈ సమస్యలకు కొంతైనా ఉపశమనం జరుగుతుందని భావించామని కానీ తిరిగి ఈ సర్దుబాటు వల్ల సమస్య తీవ్ర రూపం దాలుస్తుందని తెలిపారు. . పెండింగ్ లో ఉన్న డీ ఏ లు విడుదల చేయాలనీ, మెడికల్ బిల్లులు, పదవి విరమణ చేసిన వారికి సైతం బకాయిపడ్డ డబ్బులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పిఆర్సి నీ త్వరలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# ఇంట్లో వాడని పాత వస్తువులు ఉంటే ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇవ్వండి: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



శంకర్‌పల్లి: సెప్టెంబర్ 21: (డైలీ రిపోర్ట్): ఇంట్లో వాడని పాత వస్తువులు ఉంటే ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇవ్వాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ పరిధిలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూస్, రీసైకిల్) సెంటర్ వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్తను తగ్గించాలని, ప్లాస్టిక్ ను వినియోగించకుండా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రకృతిలో కలిసిపోయే వాటినే వినియోగించాలని, చెత్తను వేరు చేసి తిరిగి ఉపయోగించడం రీసైకిల్ చేయడం అనగా కంపోస్ట్ మొదలగునవి చేయుటకు ప్రతి ఇంట్లో అనవసరంగా ఉన్న వస్తువులను, పుస్తకాలను, చెప్పులు, బెల్టులు, బట్టలను రోడ్లపై పడేయకుండా ఆర్ఆర్ఆర్ సెంటర్ లో ఇచ్చినట్లయితే పేద ప్రజలకు ఉపయోగపడతాయని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా ఆర్ పి లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగాపురం స్నేహ యూత్ గణేష్ లడ్డూను దక్కించుకున్న ఎం. సత్యనారాయణ



**శంకర్పల్లి సెప్టెంబర్ 21 (డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపురంలో స్నేహ యువజన సంఘం వినాయక నిమర్జనం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పిల్లలు, పెద్దలు అందరు కలిసి ఎంతో ఆనందంతో నిమర్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా లడ్డు వేలం పాట నిర్వహించగా సింగపురం గ్రామానికి చెందిన యూనివర్సిటీ విశ్రాంత ఉద్యోగి ఎం. సత్యనారాయణ రూపాయలు 2,60,000 దక్కించుకున్నారు. స్నేహ యువజన సంఘం గణేష్ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి లడ్డును అందించారు. ఈ కార్యక్రమంలో స్నేహ యువజన సంఘం సభ్యులు మాణిక్యం, ఎం. రాము, ప్రవీణ్ కుమార్, సిహెచ్, మహేందర్, నరహరి, నరేష్, మల్లేష్, పవన్, దశరథ్, శ్రీకాంత్, సంపత్ కుమార్, శివకుమార్, నాని, సూర్య ప్రకాష్, సాయి ప్రసాద్, భరత్, అరుణ్, మధుపతి నాగరాజు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాన వితరణ కార్యక్రమం

**శంకర్పల్లి సెప్టెంబర్ 21 (డైలీ రిపోర్ట్):** శ్రీ షిరిడి సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర రెడ్డి కృష్ణవేణి దంపతుల కుమారుడు ధన్విన్ రెడ్డి మొదటి పుట్టినరోజు సందర్భంగా ఈరోజు పొద్దుటూరులో గల వాల్మీకి గురుకులంలో చదువుకునే తల్లిదండ్రులు లేని విద్యార్థులకు రుచికరమైన రాత్రి భోజనాన్ని పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా షిరిడి సాయి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్ల రత్నాజీ,మరియు సామాజిక కార్యకర్త ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ... విద్యార్థులు తల్లిదండ్రులు లేరనే దిగులను వీడనాడి ముందున్నటువంటి భవిష్యత్తు గురించి ఆలోచించి పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్లి ఉపాధ్యాయులు చెప్పేటటువంటి అంశాలను ఏకగ్రతతో విని వినయం విధేయత,చక్కటి నైతిక విలువలుకల్గి భావి భారత పౌరులుగా తయారు కావాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవాదళ్ సభ్యులు ఉమామహేశ్వరరావు,వాల్మీకి ఫౌండేషన్ సూపర్వైజర్ నాయుడు, చిన్న,విద్యార్థులు పాల్గొన్నారు.

# గోపులారం బొజ్జ గణపయ్యకు ఘనంగా పూజలు

**శంకరపల్లి :సెప్టెంబర్ 21(డైలీ రిపోర్ట్):**రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండల పరిధి గోపులారం గ్రామంలో పొడవు శ్రీనివాసు సర్పంచ్ సామయ్య ఆధ్వర్యంలో కొలువుదీరిన బొజ్జ గణపయ్య నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఉత్సవాలలో భాగంగా గోపులారం గణేష్ యూత్ సభ్యులు కలిసి పూజలు జరిపించారు. పూజా కార్యక్రమంలో విష్ణువర్ధన్ గొంగుపల్లి ,శ్రీపాల్ బజరంగ్దళ్ పి.రమేష్ , ఎన్ రాజు, సి.చిన్న ,టి.వెంకటేష్ ,టి. రాజు నవీన్ కాయ్ ,బి.రమేష్, సి.శ్రీకాంత్ టి.మల్లేష్ గ్రామస్తులు, మహిళా, భక్తులు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707